కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

ఇబ్రహీంపట్నం/కోరుట్ల రూరల్, ఏప్రిల్ 15: ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డుతో పాటు కోరుట్ల మండలం మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మాట్లాడుతూ, ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలని, ధాన్యం వెంటవెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. 'ఏ' గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.2320, సాధారణ రకానికి రూ. 2300 నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్రాల్లో రైతులకు సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో సహకార సంఘాల చైర్మన్లు బద్ధం గోపి, బండి భూమయ్య, వైస్ చైర్మన్ బొలిశెట్టి రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సీఈవో సతీశ్, నాయకులు చీటి వెంకట్రావ్, ఎలాల దశరథ్‌రెడ్డి, నేమూరి సత్యనారాయణ, జాజాల జగన్‌రావు, ప్రదీప్, సింగిరెడ్డి రవికాంత్‌రెడ్డి, గుంటి దేవయ్య, పుప్పాల నర్సయ్య, రెబ్బటి రాజేందర్, రాంప్రసాద్‌గౌడ్, నూత్‌పల్లి ముత్తయ్య, మారుతి, బొల్లె వినోద్, జవిడి రాజన్న, పిడుగు సందయ్య, బాబురావు, కరుణాకర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 15: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల పెండ్లికి అండగా ఉండేందుకే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రారంభించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల్లో అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆడబిడ్డల పెండ్లికి రూ.లక్ష ప్రోత్సాహకంతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి మోసం చేసిందన్నారు. కేసీఆర్ అడుగక ముందే వరాలిచ్చిన దేవుడని, ఏ రాష్ట్రంలో లేని విధంగా బీడీ కార్మికులకు పింఛన్ అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు మహిళలందరూ తరలివచ్చి, కేసీఆర్‌ను ఆశీర్వదించి, సభను విజయవంతం చేయాలని కోరారు. అలాగే, కోరుట్ల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మైనార్టీ పట్టణాధ్యక్షుడు ఎండీ ఫయీం, జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు వెంకట్రావు, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, బార్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఏప్రిల్ 15: జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఆయన ఆయా శాఖల అధికారులతో సమ్మర్ యాక్షన్ ప్లాన్-2025, ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామాల వారీగా అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా వేసవి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో స్థలం ఉండి ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులను ఎంపిక చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవోలు మధుసూదన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్, మిషన్ భగీరథ ఈఈ రమేశ్, డీఈలు, ఏఈలు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

పసుపు @ ₹15 వేలు

- ఈ సీజన్‌లో ఇదే రికార్డు

మెట్‌పల్లి, ఏప్రిల్ 15 : మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పసుపు క్వింటాల్‌కు గరిష్ఠంగా ₹15 వేలు పలికింది. పసుపు కాడి (కొమ్ము) రకానికి క్వింటాల్‌కు ఈ ధర రాగా, కనిష్ఠంగా ₹9,111, గోళ (మండ) రకానికి గరిష్ఠంగా ₹13,388, కనిష్ఠంగా ₹9,002, చూర రకానికి గరిష్ఠంగా ₹10,511, కనిష్ఠంగా ₹7,796 ధర పలికింది. కాగా కాడి, గోళ రకాలకు ఈ సీజన్‌లో ఇప్పటి వరకు పలికిన ధరల్లో ఇదే అధికం! అయితే, ఇవే ధరలు కొనసాగుతాయా..? మళ్లీ తగ్గుముఖం పడుతాయా..? అనేది ప్రశ్నార్థకమే. ఇప్పటికే రైతుల దగ్గరి నుంచి 80 శాతానికి పైగా పసుపు అమ్మకం జరిగి వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. రైతుల నుంచి భారీ ఎత్తున పసుపు విక్రయానికి తెచ్చిన సమయంలో కనీస గిట్టుబాటు ధర లభించడం లేదని పలు మార్లు రైతులు రోడ్డెక్కిన విషయం తెలిసిందే. మెజార్టీ శాతం పసుపు అమ్మకం పూర్తయ్యాక ధర పెరగడం వల్ల ఒరిగే ప్రయోజనం లేదనే వాదన చాలా మంది రైతుల నుంచి వినిపిస్తున్నది. కాగా, మంగళవారం మార్కెట్‌కు 857 క్వింటాళ్ల పసుపు విక్రయానికి వచ్చిందని, ఇప్పటి వరకు మార్కెట్‌లో మొత్తం 45,386 క్వింటాళ్ల పసుపు కొనుగోళ్లు జరిగినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- 'నమస్తే' కథనానికి స్పందన

పెగడపల్లి, ఏప్రిల్ 15: 'కేంద్రాలు నిండినయ్.. ధాన్యం కొనేదెప్పుడు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పెగడపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కాగా, కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు అధికారులు చెప్పడంతో మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి

రాయికల్, ఏప్రిల్ 15: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలంలోని పార్టీ శ్రేణులు తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బర్కం మల్లేశ్, మండల, పట్టణ కో-ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సభకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ సమన్వయ కమిటీ సభ్యులు దువ్వాక సురేశ్, భూపతి హరీశ్, శ్రీధర్, లక్ష్మీనారాయణ, శివ కుమార్, నరేశ్, శంకర్, నాగరాజు, ధన్‌రాజ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

'విజయవంతం చేయాలి'

సారంగాపూర్, ఏప్రిల్ 15: జగిత్యాలలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అధ్యక్షతన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు తేలు రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పోషణ్ పక్వాడా కార్యక్రమంపై అవగాహన

సారంగాపూర్: కోనాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, గర్భిణులు, చిన్న పిల్లల తల్లులు

జగిత్యాల రూరల్/సారంగాపూర్/రాయికల్/మల్యాల, ఏప్రిల్ 15: జగిత్యాలలోని కొత్తవాడ, సారంగాపూర్ మండలం కోనాపూర్, రాయికల్ మండలం దావన్‌పల్లి, మల్యాల మండలం బల్వంతాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లల తల్లులు, గర్భిణులకు పోషకాహారం, చిరుధాన్యాలు, రక్తహీనత, పిల్లల్లో పెరుగుదల, సరైన సమయంలో పోషకాహారం ఇవ్వడం, తదితర అంశాలపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. మహిళలకు వైద్య శిబ్బంది వివిధ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ అధికారులు స్వరూపారాణి, లత, సువర్ణ, పవిత్ర, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిగా రత్నపద్మావతి

జగిత్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 15: జగిత్యాల ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా రత్నపద్మావతిని నియమిస్తూ హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా జడ్జి నీలిమను మెదక్ జిల్లాకు బదిలీ చేయగా, రంగారెడ్డి రెండో అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జి రత్నపద్మావతిని జగిత్యాల జిల్లా జడ్జిగా బదిలీ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 15: కల్లెడ గ్రామానికి చెందిన తాళ్ల తిరుపతి ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్ రెడ్డి పరామర్శించారు.

మెట్‌పల్లి, ఏప్రిల్ 15: పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం మాజీ అధ్యక్షుడు వేములవాడ భాస్కర్ ఇటీవల మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబసభ్యులను మంగళవారం ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ పరామర్శించారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సద్గురు, రచయిత జనార్దనాచారి, ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బ్రహ్మం ఉన్నారు.

కోరుట్ల గురుకులంలో విద్యార్థులకు అస్వస్థత

- 30 మందికి మూడు రోజులుగా దగ్గు, జ్వరం, తలనొప్పి
- పట్టించుకోని సిబ్బంది
- తీవ్రం కావడంతో దవాఖానకు తరలింపు

విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 15: కోరుట్ల పట్టణ శివారులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు దవాఖాన పాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. పాఠశాలలో 500 మంది అభ్యసిస్తున్నారు. అందులో 30 మంది పిల్లలు మూడు రోజులుగా దగ్గు, జ్వరం, తలనొప్పితో బాధపడుతున్నా సిబ్బంది పట్టించుకోలేదు. అయితే మంగళవారం ఉదయం అల్పాహారం చేసిన తర్వాత జ్వరం తీవ్రం కావడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించి, కోరుట్లలోని ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. వీరిలో 16 మందికి ప్రథమ చికిత్స చేసి పంపించారు. మరో 14 మందికి జ్వరం తీవ్రంగా ఉండడంతో దవాఖానలో చికిత్స అందిస్తున్నారు. అయితే సాయంత్రం వరకు ఇందులో ఎనిమిది మందిని డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం ఆరుగురు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల ప్రభుత్వ దవాఖానకు వెళ్లి విద్యార్థులను పరామర్శించి, అస్వస్థతకు గల కారణాలను వైద్యులు, గురుకుల పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ సునీతారాణిని ఆదేశించారు. అలాగే డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, కోరుట్ల ఆర్డీవో జీవాకర్‌రెడ్డి ప్రభుత్వ దవాఖానకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కాగా, గురుకుల పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు వివిధ పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీవో రఘువరన్

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 15: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో రఘువరన్ సూచించారు. మండలంలోని నర్సింగాపూర్, వెల్దుర్తి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 133 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే, వంజరిపల్లి, జాబితాపూర్, ధర్మారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. ఎంపీడీవో రమాదేవి, ఏపీఎం గంగాధర్, మాజీ ప్రజాప్రతినిధులు మహేశ్, మల్లారెడ్డి, శేఖర్ రెడ్డి, మల్లేశం గౌడ్, నరేశ్, ప్రవీణ్, ప్రకాశ్, మమత, గ్రామ సమైక్య అధ్యక్షురాలు దివ్య, జమున, వీవోలు పాల్గొన్నారు.

సంస్కృతం విలువలను పెంచే భాష

కథలాపూర్, ఏప్రిల్ 15: సంస్కృతం మార్కుల భాష కాదని, విలువలను పెంచే భాష అని సంస్కృతం లెక్చరర్ల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాగండ్ల రాజశేఖర్ పేర్కొన్నారు. కథలాపూర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం ఉంటే ఎవరికీ నష్టం కలుగదన్నారు. ఇంటర్ బోర్డు సంస్కృతంను ద్వితీయ భాషగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశపెట్టడానికి జీవో జారీ చేయడం శుభ పరిణామమన్నారు.

సహకార సంఘ సమావేశం

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 15: లక్ష్మీపూర్‌లో రైతు పరస్పర సహాయక సహకార సంఘం, ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం మంగళవారం అధ్యక్షుడు పన్నాల తిరుపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కో-ఆపరేటీవ్ అధికారులు మనోజ్‌కుమార్, అశోక్‌కుమార్ హాజరయ్యారు. కాగా, సమావేశంలో సంవత్సర కాలంలో చేపట్టిన లావాదేవీలపై చర్చించారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు గర్వంద చిన్నగంగయ్య, డైరెక్టర్లు రాజేశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి, పోచయ్య, గంగారెడ్డి, రాజిరెడ్డి, తిరుపతి రెడ్డి, మనోహర్, స్వామిరెడ్డి, వెంకట్, లింగారెడ్డి, జయంత్ రెడ్డి, తిరుపతి, సభ్యులు పాల్గొన్నారు.

'భూ భారతి'పై అవగాహన కల్పించాలి

జగిత్యాల, ఏప్రిల్ 15: భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాలలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి భూ భారతి చట్టం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా వాణి దరఖాస్తులను ఇక నుంచి ప్రతి వారం స్క్రూటినీ చేయడం జరుగుతుందని, వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ భారతి చట్టంపై తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు మధుసూదన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

I. Neerati Haarika W/o. Vishnuprasad, H.No. 11-83, Racharla Boppapur, Yellareddypet Mandal. Rajanna Sircilla Dist. My Name was Changed to Gattipally Thirumala D/o.Naga Bhooshanam.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

దరఖాస్తుల గడువు పొడిగింపు

మెట్‌పల్లి, ఏప్రిల్ 15: అగ్నివీర్ పథకంలో యువకులు తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 25 వరకు గడువును ప్రభుత్వం పొడిగించిందని తెలిపారు.

మెట్‌పల్లి/జగిత్యాల రూరల్, ఏప్రిల్ 15: అగ్నివీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల గడువు ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ, మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వెంకయ్య మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆసక్తి గల యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

అలరించిన వీడ్కోలు హంగామా

మెట్‌పల్లి, ఏప్రిల్ 15: పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ, ప్రథమ సంవత్సరం విద్యార్థులు మంగళవారం స్థానిక మనోహర్ గార్డెన్స్‌లో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా వైద్యులు డా. హెప్సిబా, డా.జాకబ్ కిరణ్ హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కేవీ సంతోష్, వైస్‌ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 15: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ పేర్కొన్నారు. కోరుట్ల పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, చికెన్ సెంటర్లలో మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న పలువురు దుకాణాదారులకు సుమారు రూ.12 వేలు జరిమానా విధించారు. వ్యాపారులు చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బంది తీసుకొచ్చే వాహనాల్లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలె అశోక్, జగదీశ్, మహేశ్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన

కొడిమ్యాల, ఏప్రిల్ 15: మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో మంగళవారం కాంట్రాక్ట్ అధ్యాపకులు తమను రెగ్యులరైజ్ చేయాలని నిరసన తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 19 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ధర్మపురిరూరల్: అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జగిత్యాల, ఏప్రిల్ 15: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్‌లో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై పలు విన్యాసాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి కృష్ణకాంత్, ఎల్ఎఫ్‌కే రవీందర్, ఆపరేటర్లు మల్లేశం, వెంకటేశ్వర్లు, శంకరయ్య, ఫైర్‌మెన్లు పాల్గొన్నారు.

ధర్మపురి రూరల్, ఏప్రిల్ 15: ధర్మపురి బస్టాండ్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలో విన్యాసాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్‌వో శ్రీకాంత్, సిబ్బంది ప్రవీణ్‌రావు, రత్నాకర్, శ్రీనివాస్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బియ్యం పంపిణీ అవాస్తవం

- అసత్య ప్రచారం చేస్తే క్రిమినల్ కేసు
- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 15: రేషన్ షాపుల్లో పంపిణీ చేసే సన్నబియ్యంలో ప్లాస్టిక్ రైస్ ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని, తిలక్ నగర్‌లో పంపిణీ చేసే సన్నబియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిపారని కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేశారని చెప్పారు. అక్కడి అధికారులు విచారణ చేశారని, వాస్తవం లేదని గుర్తించి, ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకున్నారని వివరించారు. సన్నబియ్యం పథకంపై ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎండ వేడి తాళ లేక..

- పెగడపల్లిలో సైకిల్‌పై నుంచి పడి ఒకరి మృతి

పెగడపల్లి, ఏప్రిల్ 15: పెగడపల్లి మండల కేంద్రానికి వడ్లూరి మల్లయ్య (59) మంగళవారం ఎండ వేడికి తాళలేక సైకిల్‌పై నుంచి కిందపడడంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య మధ్యాహ్నం సమయంలో తన ఇంటి వద్ద నుంచి బయటకు సైకిల్‌పై వెళ్తున్నాడు. నందీ చౌరస్తా దాటగానే ఎండ తీవ్రతకు కళ్లు తిరిగి రోడ్డు పక్కన ఉన్న ట్రాక్టర్ ట్రాలీకి సైకిల్ తాకి మల్లయ్య వెనక్కి పడిపోయాడు. తల వెనుక భాగంలో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మల్లయ్య కొడుకు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

బస్సును ఢీకొన్న కారు

మల్యాల, ఏప్రిల్ 15: కొండగట్టు బస్ స్టేజీ వద్ద జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సును కారు వెనుక నుంచి ఢీకొట్టినట్లు ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.